సాక్షి తూర్పుగోదావరి

శనివారం । 9 । మార్చి । 2024



పరీక్షలకు ఇలా సిద్ధమవ్వాలి

పదవ తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రణాళిక ప్రకారం సన్నద్ధమైతే మెరుగైన ఫలితాలు సాధించడం కష్టమేమీ కాదంటున్నారు నిపుణులు.

8లో



శూలాలు గుచ్చుకొని.. మొక్కులు తీర్చుకొని

మహాశివరాత్రి సందర్భంగా ఆ గ్రామాల్లోని భక్తులు శూలాలు, సూదులు గుచ్చుకుని వింత ఆచారం పాటిస్తారు.

8,970 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల నీరు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.70 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

బీసీ మంత్రి వేణుపై గోరంట్ల తప్పుడు వ్యాఖ్యలు

- వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆగ్రహం
- బుచ్చయ్య చౌదరి దిష్టిబొమ్మ దహనం



బొమ్మూరులో ఎమ్మెల్యే గోరంట్ల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణపై టీడీపీకి చెందిన రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తప్పుడు వ్యాఖ్యలు చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలపై ప్రజల్లో చైతన్యం తీసుకునివచ్చేందుకు మంత్రి వేణు కొన్నాళ్లుగా 'స్వచ్ఛత - మనందరి బాధ్యత' పేరిట వినూత్న కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో స్వయంగా చెత్తను తొలగిస్తూ, ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజల్లో స్ఫూర్తిని రగిల్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ధవళేశ్వరంలో శుక్రవారం పర్యటించిన రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి.. 'చెత్త మంత్రి' అంటూ వేణుపై తప్పుడు వ్యాఖ్యలు చేశారు. దీనిపై తీవ్రంగా మండిపడిన బీసీ, ఎస్సీ సంఘాలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు బొమ్మూరు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ యువ నాయకుడు నక్కా రాజేంద్ర మాట్లాడుతూ, బీసీ వర్గానికి చెందిన మంత్రి వేణును కించపరిచేలా గోరంట్ల మాట్లాడటం, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడమేనని అన్నారు. వచ్చే ఎన్నికల్లో గోరంట్లను రూరల్ నియోజకవర్గంలో ఓడించడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఇందుకు పార్టీలకు అతీతంగా బలహీన వర్గాలకు చెందిన ప్రజలందరూ కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే గోరంట్ల పదేళ్లుగా నియోజకవర్గాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్నందున ఓట్ల కోసం గ్రామాల్లో పర్యటిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ యువజన అధ్యక్షుడు రాకేష్ రాయుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, రూరల్ మండలం ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుందరపల్లి అనిల్, ఉపాధ్యక్షులు మద్దా దుర్గారావు, ఎలుగొండ లక్ష్మి, కోటి రాజశేఖర్, తోడేటి రాహుల్, నక్కా స్వామి, జాలా మోషే తదితరులు పాల్గొన్నారు.

14 స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టుల భర్తీ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 14 స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను పదోన్నతి ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఖాళీల వివరాలను ఇప్పటికే కాకినాడ డీఈఓ కార్యాలయం సేకరించింది. అర్హుల జాబితా సిద్ధం చేసి, ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు కాకినాడ డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టనుంది. దీనికి స్పెషల్ ఎడ్యుకేషన్ అర్హత కలిగి ఉన్న ఎస్జీటీలు సర్వీస్ రిజిస్టర్, అర్హత సర్టిఫికెట్లతో హాజరు కావావాలని తెలిపారు. ఆదివారం తర్వాత వచ్చే దరఖాస్తులను పరిశీలించబోమని డీఈఓ కార్యాలయం పేర్కొంది. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ ఆధ్వర్యాన పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తారని డీఈఓ కార్యాలయం ఏడీ నాగేశ్వరరావు తెలిపారు.

ముక్కంటి దర్శనం.. భక్తజన పరవశం



రాజమహేంద్రవరం కోటిలింగాల రేవులో గోదావరి పుణ్యస్నానాలకు తరలివచ్చిన భక్తులు

- మహా శివరాత్రి పర్వదిన వేళ కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- మార్మోగిన శివనామ స్మరణ
- గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మహాశివరాత్రి పర్వదిన వేళ జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తజనగోదారులే అయ్యాయి. ఇసుకేస్తే రాలనంతగా భక్తులు తరలి రావడంతో ప్రముఖ శివాలయాలు కిటకిటలాడాయి. ఈసారి అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం మహాశివరాత్రి రావడంతో భక్తులు భారీ సంఖ్యలో పోటెత్తారు. దాదాపు అన్ని ఆలయాల్లోనూ ఆ శివయ్యకు లక్ష బిల్వార్చనలు, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ప్రభుత్వం ముందస్తుగా విస్తృత ఏర్పాట్లు చేయడంతో భక్తుల సంఖ్య పెరిగినా ఎటువంటి ఇబ్బందీ తలెత్తలేదు. పలు ఆలయాల్లో స్వామి వారి గ్రామోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. అన్ని శివాలయాల్లోనూ లింగోద్భవ కాల అభిషేకాలు నిర్వహించారు. గోదావరి తీరం శివ నామ స్మరణతో మార్మోగిపోయింది. వేకువజాము నుంచే భక్తులు పావన గోదావరి నదితో పాటు కాలువలు, కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి, పరమేశ్వరుని దర్శనానికి పోటెత్తారు. రాజమహేంద్రవరంలోని పుష్కర ఘాట్, కోటిలింగాల ఘాట్, సరస్వతీ ఘాట్, వీఐపీ ఘాట్, కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో వేలాదిగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. హర హర మహాదేవా అంటూ భక్తిపారవశ్యంతో చేసిన నినాదాలు శివాలయాల్లో ప్రతిధ్వనించాయి. రాజమహేంద్రవరంలోని ఉమా కోటిలింగేశ్వర స్వామి, ఉమా మార్కండేయేశ్వర స్వామి, సారంగధరేశ్వర స్వామి, జాంపేటలోని ఉమా రామలింగేశ్వర స్వామి, గోదావరి ఒడ్డున కొత్తగా నిర్మించిన మహాకాళేశ్వరాలయాల్లో పరమేశ్వరుడిని భక్తులు దర్శించుకుని, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా రాజమహేంద్రవరం నలుమూలలా దాతలు వివిధ ఆహార పదార్థాలు, పానీయాలు పెద్ద ఎత్తున వితరణ చేశారు.





రాజమహేంద్రవరం ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు



పుష్కరాల రేవులో భక్తజన గోదారి

చిరునవ్వుతో ఒత్తిడి చెల్లు



మహిళా దినోత్సవం కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఉద్యోగ, కుటుంబ బాధ్యతల నిర్వహణలో మహిళలకు ఒత్తిడిని అధిగమించడం చిన్న చిరునవ్వుతో సాధ్యమవుతుందని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తన క్యాంపు కార్యాలయంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బందితో కలసి శుక్రవారం ఆమె కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పురుషులతో పాటు మహిళలు నేడు అన్ని రంగాల్లోనూ ప్రతిభ చూపుతూ, ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు గృహిణిగా ఇంటా బయటా తమదైన పాత్ర ఎంతో సమర్థవంతంగా పోషించాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో ఒత్తిడికి గురవకుండా ఏ సమస్యకైనా క్రమబద్ధమైన ప్రణాళిక సిద్ధం చేసుకోవడం ముఖ్యమని సూచించారు. రోజులో మన కోసం కొంత సమయం కేటాయించుకోవాలని, వ్యాయామం చేయడం, మనసుకు ఇష్టమైన వ్యాపకం చేసుకోవడం ముఖ్యమని చెప్పారు. గృహిణిగా, ఇల్లాలిగా, కూతురిగా, తల్లిగా, ఉద్యోగిగా ఒకే సమయంలో విభిన్న పాత్రలు సమర్థవంతంగా పోషించాల్సి ఉంటుందని కలెక్టర్ అన్నారు. ఈ వేడుకల్లో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు కూడా పాల్గొన్నారు.

శివరాత్రి బందోబస్తుపై ఎస్పీ పర్యవేక్షణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మహాశివరాత్రి సందర్భంగా శివాలయాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ పి.జగదీష్ శుక్రవారం పర్యవేక్షించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో గోదావరి స్నానపు ఘాట్లు, ఆలయాలు, క్యూ లైన్లతో పాటు పార్కింగ్ ప్రదేశాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా తెల్లవారుజాము నుంచే శాంతిభద్రతలు, సీసీఎస్, ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బందితో చేసిన బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ నిరంతరం పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



శివరాత్రి బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

ఆపదలో ఉన్న వారికి సీఎంఆర్ఎఫ్ అభయం

- మంత్రి తానేటి వనిత
- బాధిత కుటుంబానికి రూ.10 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ అందజేత

దేవరపల్లి: ఆపదలో ఉన్న వారి కుటుంబాలను ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అభయమిచ్చి, ఆదుకుంటోందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ తానేటి వనిత అన్నారు. కాలేయ మార్పిడికి హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దేవరపల్లి మండలం కృష్ణంపాలేనికి చెందిన పెనుగొండ శివకుమార్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.10 లక్షలకు లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను ఆయన కుటుంబ సభ్యులకు ఆమె శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శివకుమార్ కాలేయ మార్పిడికి సుమారు రూ.10 లక్షలు ఖర్చవుతుందని స్థానిక నాయకులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. శివకుమార్ అనారోగ్యం గురించి ఆయన భార్య రవీనా తన ఇద్దరు చిన్న బిడ్డలతో వచ్చి, తనకు విన్నవించుకున్నారని, వారి కష్టం విని చలించిపోయానని చెప్పారు. వెంటనే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లగా.. ఆయన పై మొత్తాన్ని మంజూరు చేసి, బాధిత కుటుంబానికి అండగా నిలిచారని మంత్రి వనిత తెలిపారు. తమది పేదల పక్షపాత ప్రభుత్వమనే విషయాన్ని సీఎం జగన్ మరోసారి రుజువు చేశారని అన్నారు. శివకుమార్ చికిత్స అనంతరం త్వరగా కోలుకోవాలని మంత్రి వనిత ఆకాంక్షించారు. ఈ సాయాన్ని ఎప్పటికీ మరచిపోలేమని కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



శివకుమార్ కుటుంబానికి రూ.10 లక్షల సీఎంఆర్ఎఫ్ లెటర్ ఆఫ్ క్రెడిట్ అందిస్తున్న మంత్రి వనిత

శేషారావుకు శరాఘాతం

- నిడదవోలులో పోటీకి జనసేన నేత దుర్గేష్ సై
- టీడీపీ సీనియర్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లికి భంగపాటు
- చంద్రబాబుపై ఆ పార్టీ శ్రేణుల ఆగ్రహం
- రూరల్‌లో పంతం నెగ్గించుకున్న సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల!
- చంద్రబాబు నుంచి స్పష్టమైన సంకేతాలు



సీటు హుళక్కేనా..: బూరుగుపల్లి శేషారావు



నిడదవోలులో సై : కందుల దుర్గేష్



హమ్మయ్యా.. ధీమా వచ్చింది: గోరంట్ల బుచ్చయ్య చౌదరి

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ, జనసేన పొత్తు టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు శరాఘాతంగా మారిందా? అహర్నిశలూ పార్టీ బలోపేతానికి పాటుపడినా కనీస గౌరవం కూడా ఇవ్వకుండా పక్కన పెట్టేస్తున్నారా? అంటే అవుననే సమాధానం వస్తోంది ఆ పార్టీ శ్రేణుల నుంచి. జిల్లాలో సీట్ల ప్రకటనపై టీడీపీ, జనసేన అధిష్టానాలు తీసుకుంటున్న నిర్ణయాలతో ఆ పార్టీల నేతలు నలిగిపోతున్నారు. రోజుకో నిర్ణయం తెరపైకి ప్రచారంలోకి వస్తుండటంతో తమ భవితవ్యం ఏమిటనే ప్రశ్న ఆశావహుల్లో ఉత్పన్నమవుతోంది.

శేషారావుకు పొత్తు సెగ

నిడదవోలు మాజీ ఎమ్మెల్యే శేషారావుకు టీడీపీ, జనసేన పొత్తు సెగ తగిలింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నిడదవోలు నుంచి పోటీ చేసేందుకు ఆయన అన్ని విధాలా సిద్ధమయ్యారు. టీడీపీ నిర్వహించిన సర్వేలో సైతం ఆయనకే మొగ్గు చూపింది. సీటు ఖరారు చేస్తారనుకున్న సమయంలో పొత్తు పితలాటకం ఆయనకు శరాఘాతమే అవుతోంది. రాజమహేంద్రవరం రూరల్ సీటు ఆశిస్తున్న జనసేన నేత కందుల దుర్గేష్‌ను నిడదవోలు పంపాలని అధిష్టానం నిర్ణయించింది. అయితే, రాజమహేంద్రవరం రూరల్ నుంచే తాను పోటీ చేస్తానని మొదట్లో బెట్టు చేసిన దుర్గేష్.. చివరకు అధినేత నిర్ణయానికి తల వంచి, నిడదవోలులో పోటీకి సై అన్నారు. టీడీపీ కేడర్ మొత్తం దుర్గేష్ విజయానికి కృషి చేస్తుందని, అన్ని విధాలుగా సహకారం అందిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు భరోసా ఇచ్చినట్లు తెలిసింది. కానీ, ఆయన రాకను స్థానికంగా టీడీపీ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. అయినప్పటికీ త్వరలోనే దుర్గేష్ నిడదవోలులో ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్లు సమాచారం. దీంతో శేషారావు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆయనకు టికెట్ నిరాకరించడంతో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. అయినప్పటికీ టీడీపీ అధిష్టానం పట్టించుకున్న దాఖలాలు లేవు. శేషారావును పార్టీ అధినేత చంద్రబాబు కనీసం పిలిచి మాట్లాడకపోవడంపై టీడీపీ శ్రేణులు గుర్రుగా ఉన్నాయి. సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే అని కూడా చూడకుండా అన్యాయంగా పక్కన పెట్టేస్తున్నారంటూ వారు చంద్రబాబుపై మండిపడుతున్నారు. స్థానికేతరుడయిన కందుల దుర్గేష్‌కు నిడదవోలు కేటాయించడమేమిటని, ఆయన ఇక్కడ ఎలా గట్టెక్కుతారో తామూ చూస్తామని సవాల్ విరుసుతున్నారు. పార్టీ పటిష్టతకు రూ.లక్షలు ధార పోసిన శేషారావును కాదని దుర్గేష్‌కు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. పార్టీలో కార్యకర్తలకు, నేతలకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ మండిపడుతున్నారు.

బుచ్చయ్యకు ధీమా

రాజమహేంద్రవరం రూరల్‌లో పోటీపై టీడీపీ సీనియర్ నేత, సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఎట్టకేలకు తన పంతం నెగ్గించుకున్నారు. ఇక్కడి నుంచి మరోసారి ఎన్నికల బరిలోకి దిగేందుకు టీడీపీ అధిష్టానంతో ఆయన పెద్ద యుద్ధమే చేశారు. పొత్తులో భాగంగా రూరల్ సీటు జనసేనకు కేటాయించారని, దుర్గేష్ పోటీ చేస్తారని స్వయంగా జనసేన అధినేత పవన్ కళ్యాణే ప్రకటించారు. చంద్రబాబు సైతం అందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో బుచ్చయ్య కలవరపడ్డారు. ఒకానొక దశలో ఈ సీటు చేజారిపోతుందేమోననే ఆందోళన సైతం ఆయనలో వ్యక్తమైంది. దీనిపై అమీతుమీ తేల్చుకునేందుకు పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రయత్నాలు చేశారు. హైదరాబాద్, విజయవాడల్లో మకాం వేశారు. సీటు తనకే ఇవ్వాలని పట్టుబట్టారు. చంద్రబాబుపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచీ ఉన్న తనను పక్కన పెట్టాలనుకోవడం తగదని అధిష్టానంతో గట్టిగా వాదించారు. దీంతో మీమాంసలో పడిన చంద్రబాబు ఇంత వరకూ ఈ సీటుపై స్పష్టత అయితే ఇవ్వలేదు. దుర్గేష్‌ను నిడదవోలు పంపుతూండటంతో రూరల్ స్థానం తనదేనని బుచ్చయ్య ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీనిపై చంద్రబాబు నుంచి తాజాగా స్పష్టతమైన సంకేతాలు అందాయని చెబుతున్నారు. ఇక పోటీ నుంచి తనను ఆపే పరిస్థితి ఎవ్వరికీ లేదని అంటున్నారు. పార్టీలో చంద్రబాబు కంటే సీనియర్ అయిన గోరంట్ల తన సిట్టింగ్ స్థానం కోసం ఇంత మానసిక క్షోభ అనుభవించాలా? సీనియర్ నేతలకు దక్కే గౌరవం ఇదేనా అని టీడీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు.

రూ.2.5 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటకు చెందిన పాము రామకృష్ణ, అనంతలక్ష్మి దంపతులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.2.5 లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కును రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హుకుంపేటకు చెందిన పాము చిరంజీవి లుకేమియా (బ్లడ్ క్యాన్సర్) బారిన పడి, చికిత్స పొందుతూ ఇటీవల మరణించాడన్నారు. సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.5 లక్షల చెక్కును అతడి తల్లిదండ్రులు అనంతలక్ష్మి, రామకృష్ణలకు అందించామని చెప్పారు. చిరంజీవి నీట్‌లో ర్యాంకు సాధించి, రాజమహేంద్రవరంలో కొత్తగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరిన కొద్ది రోజులకే లుకేమియాతో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. పేదల అనారోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటుందని చెప్పారు. పేదల ఆరోగ్య భద్రత కోసం ఆరోగ్యశ్రీ పథకం చికిత్స పరిమితిని రూ.25 లక్షలకు పెంచి, ఖరీదైన కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామని మంత్రి వేణు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించని వ్యాధులకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నారని తెలిపారు.



అనంతలక్ష్మి, రామకృష్ణలకు రూ.2.5 లక్షల చెక్కు అందజేస్తున్న మంత్రి వేణు

పది క్షలకు ఇలా సిద్ధమవ్వాలి

- కార్యాచరణే కీలకం
- ఉత్తమ ఫలితాలు విద్యార్థుల చేతుల్లోనే
- ఇక మిగిలింది 9 రోజులే
- మెళకువలపై ఉపాధ్యాయుల సూచనలు

రాయవరం: పదవ తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది ఏడు పేపర్లతో పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రణాళిక ప్రకారం సన్నద్ధమైతే మెరుగైన ఫలితాలు సాధించడం కష్టమేమీ కాదంటున్నారు. నిపుణులు. పదో తరగతి పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో సబ్జెక్టు నిపుణులు చెబుతున్న అభిప్రాయాలతో కథనం..


సన్నద్ధమవుతున్న విద్యార్థులు

ఆంగ్లంలో రీడింగ్ కాంప్రహెన్షన్‌దే అగ్రస్థానం



ఇంగ్లిష్ ప్రశ్నపత్రంలో మూడు సెక్షన్లలో 1–35 వరకు ప్రశ్నలుంటాయి. సెక్షన్–ఎలో మూడు పాసేజ్‌లు పాఠ్యాంశం నుంచి 15 ప్రశ్నలు ఇస్తారు. ఈ 15 ప్రశ్నలకు 30 మార్కులు వస్తాయి. పాఠ్య పుస్తకంపై అవగాహన ఉంటే 30 మార్కులు సులభంగా సాధించవచ్చు. సెక్షన్–బిలో 16వ ప్రశ్న నుంచి 32వ ప్రశ్న వరకు 17 ప్రశ్నలు 40 మార్కులకు ఇస్తారు. గ్రామర్, ఒకాబ్లరీ నుంచి ఈ ప్రశ్నలు ఇస్తారు. ప్రతి పాఠ్యాంశం వెనుక ఉన్న గ్రామర్, ఒకాబ్లరీ చదవడం ద్వారా 40 మార్కులు సాధించవచ్చు. సెక్షన్–సిలో 33–35 వరకు ఇచ్చే ప్రశ్నలు విద్యార్థుల్లోని సృజనాత్మకతను రైటింగ్ స్కిల్‌లో పరీక్షిస్తారు. లెటర్ రైటింగ్, కాన్వర్సేషన్, డైరీ ఎంట్రీ, ఎడిటర్ లెటర్, బయోగ్రాఫికల్ స్కెచ్, ఫ్రేమింగ్ డబ్ల్యుహెచ్ ప్రశ్నలు లేకుంటే ఇన్ఫర్మేషన్ ట్రాన్స్‌ఫర్‌పై ప్రశ్నలు ఇస్తారు. ఇచ్చిన గ్రాఫ్ లేదా చార్ట్‌కి పేరాగ్రాఫ్ రాయాలి. వీటిపై పట్టు సాధిస్తే 30 మార్కులు సాధించే వీలుంది. 33వ ప్రశ్న ఏ,బీ రీడింగ్ నుంచి 35వ ప్రశ్న కచ్చితంగా సి రీడింగ్ నుంచి వస్తుంది.

– ఒరిగెల జగపతి, ఎస్‌ఏ(ఇంగ్లిష్), జెడ్పీహెచ్‌ఎస్, చెయ్యేరు, కాట్రేనికోన మండలం

లెక్క తప్పకూడదంటే సాధన ముఖ్యం



గణితంలో 1, 2, 4 మార్కుల ప్రశ్నలకు చాయిస్ ఉండదన్న విషయాన్ని విద్యార్థులు గమనించాలి. 8 మార్కుల ప్రశ్నలకు మాత్రమే చాయిస్ ఉంటుంది. ప్రస్తుత విధానంలో ఇస్తున్న ప్రశ్నపత్రం ఏ,బీ గ్రేడ్ విద్యార్థులు అధికంగా మార్కులు పొందేందుకు, సీ,డీ గ్రేడ్ విద్యార్థులు ఉత్తీర్ణులు కావడానికి అనువుగా ఉంది. 'ఏ,బీ గ్రేడ్ విద్యార్థులు 95కు పైగా మార్కులు సాధించాలంటే 4, 8 మార్కుల ప్రశ్నలపై దృష్టి సారించాలి. 'సీ,డీ గ్రేడ్ విద్యార్థులు సమితులు, సాంఖ్యక శాస్త్రం, సంభావిత, నిరూపక రేఖాగణితం, వాస్తవ సంఖ్యలు, గ్రాఫ్‌లు, నిర్మాణాలు, పటాలపై దృష్టి సారిస్తే కనీసం 60 మార్కులు సాధిస్తారు. ప్రశ్న పత్రంలో 33 ప్రశ్నలుంటాయి. గణిత భావనలు అవగాహన చేసుకుని సూత్రాలపై పట్టు సాధిస్తే సులభంగా నూరు శాతం మార్కులు సాధించవచ్చు.

– తోపెల్ల వీరవెంకటసత్యనారాయణమూర్తి (గణితావధాని), జెడ్పీహెచ్‌ఎస్(బాలురు), అమలాపురం

ప్రయోగాలు, డయాగ్రామ్స్‌పై దృష్టి సారించాలి



'భౌతికశాస్త్రంలో కాంతి, విద్యుత్ యూనిట్లు, సూత్రాల ఉత్పాదన, గణన, నిత్యజీవిత వినియోగం, భేదాలు..తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. వీటిపై 25 మార్కుల ప్రశ్నలు వచ్చే అవకాశముంది. రసాయన శాస్త్రంలో కర్బన సమ్మేళనాలు, సమీకరణాలు, పరమాణు నిర్మాణం, లోహ సంగ్రహణ శాస్త్రం, మూలకాల వర్గీకరణ, రసాయన బంధాలు, ఆమ్లాలు, క్షారాలు యూనిట్లపై పూర్తి పట్టు సాధించాలి. వీటిపై కూడా 25 మార్కులకు ప్రశ్నలు సంధించే అవకాశముంది. శాస్త్రవేత్తల విశేషాలను బాగా గుర్తుంచుకోవాలి. 'కాన్సెప్ట్‌పై ఏ విధమైన అవగాహన తెలుసుకునే విధంగా ప్రశ్నలు తయారు చేయడంపై నాలుగు మార్కుల ప్రశ్నలు ఇస్తారు. 'పాఠ్య పుస్తకంలో పట్టికల రూపంలో ఉన్న సమాచారంపై విద్యార్థికి ఉన్న అవగాహన తెలుసుకునేందుకు ఆరు నుంచి ఎనిమిది మార్కుల వరకు ప్రశ్నలు వచ్చే అవకాశముంది. ప్రయోగాలు, డయాగ్రమ్స్‌పై దృష్టి సారిస్తే ఎనిమిది మార్కులు సాధించే అవకాశముంది.

– ఏవీఎల్ నరసింహారావు, ఎస్‌ఏ(పీఎస్), చింతనలంక, అయినవిల్లి మండలం

హిందీపై శ్రద్ధ వహించాలి



హిందీ పాఠ్యాంశాలను చదవడం, రాయడం, బాగా సాధన చేయడంపై శ్రద్ధ వహించాలి. పాఠ్యాంశాన్ని పూర్తిగా అర్థం చేసుకుని చదివితే ప్రశ్నలు ఎలా అడిగినా సమాధానాలు రాయవచ్చు. సులభంగా మార్కులు తెచ్చుకోవడానికి అవకాశం ఉన్న లేఖలు రాయడంపై సాధన చేయాలి. 'గ్రామర్‌గా ఉన్న 1–12 ప్రశ్నలు(థింకింగ్ స్కిల్స్) పాఠానికి మినిమమ్ ఐదు ప్రాక్టీస్ చేయాలి. 'రోమన్–2లో పద్యం నుంచి ఒకటి, గద్యం నుంచి మూడు పాసేజ్‌లు ఇచ్చి అవగాహన చేసుకుని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. 'రోమన్–3లో 17 ప్రశ్నకు నాలుగు మార్కులు, 18వ ప్రశ్నకు నాలుగు మార్కులు ఇస్తారు. 17వ ప్రశ్నకు మ్యాచింగ్ కవితాభాగం నుంచి ఉంటుంది. 18వ ప్రశ్నకు గద్యం నుంచి పాసేజ్ ఇచ్చి దానికి సంబంధించి నాలుగు ఖాళీలను పూరించాల్సి ఉంటుంది. 'రోమన్–4లో ఎనిమిది షార్ట్ ఆన్సర్ ప్రశ్నలుంటాయి. '19, 20 ప్రశ్నలు పద్యభాగం, 21,22,23 ప్రశ్నలు గద్య భాగం, 24,25,26 ప్రశ్నలు ఉపవాచకం నుంచి ఇస్తారు. రోమన్–5లో 27వ ప్రశ్నకు చాయిస్ ఉంటుంది. పద్యభాగ సారాంశాలు రెండు ఇస్తారు. ఒకటి రాయాలి.

– మహమ్మద్ రజియా భాను, ఎస్‌ఏ(హిందీ), జెడ్పీహెచ్‌ఎస్, గీతామందిరం, సఖినేటిపల్లి.

విశ్లేషణాత్మకంగా రాయాలి



తెలుగులో ఈ ఏడాది పద్యం పూరణ, ప్రతి పదార్థం తొలగించారు. దాని స్థానంలో పాఠ్యాంశంలో ఉన్న పద్యం ఇచ్చి ప్రశ్నలు ఇస్తారు. లేఖా ప్రక్రియ లేదా కరపత్రం సాధన చేస్తే సులభంగా 8 మార్కులు సంపాదించేందుకు అవకాశముంది. అక్షర దోషాలు, కొట్టివేతలు లేకుండా జవాబులు రాయాలి. అవగాహన–ప్రతిస్పందనలో పాఠ్యభాగంలోని పద్యంపై 8 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. ఒక్కొక్క కాండంలో ఒక్కొక్క వాక్యం ఇస్తారు. కాండముల పేర్లు వరుసలో ఉంచాలి. గద్య భాగం నుంచి ఒక పేరా ఇచ్చి నాలుగు ప్రశ్నలు 8మార్కులకు ఇస్తారు. అపరిచిత గద్యం ఇచ్చి 8 మార్కులకు నాలుగు ప్రశ్నలు ఇస్తారు. అవగాహన–ప్రతిస్పందనకు 32 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. భావ వ్యక్తీకరణ, సృజనాత్మకకు 36 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నపత్రాన్ని అవగాహన చేసుకున్న తర్వాత వచ్చిన ప్రశ్నలు ముందుగా రాసుకోవాలి.

– కామవరపు మల్లికార్జునరావు, తెలుగు భాషా పండితుడు, జెడ్పీహెచ్‌ఎస్ బాలికల ఉన్నత పాఠశాల, కంద్రిగ, ఆలమూరు మండలం

మ్యాపులతో మంచి మార్కులు



సోషల్‌లో పట్టికలు, గ్రాఫ్‌లు, మ్యాప్ పాయింటింగ్, సమాచార విశ్లేషణ వంటి వాటిని బాగా సాధన చేయాలి. '13–20 వరకు రెండు మార్కుల ప్రశ్నలు, 21–28 వరకు నాలుగు మార్కుల ప్రశ్నలుంటాయి. 29–33 వరకు ఎనిమిది మార్కుల ప్రశ్నలుంటాయి. 1–28 ప్రశ్నల వరకు చాయిస్ ఉండదు. 29–33 వరకు ఇంటర్నల్ చాయిస్ ఉంది. భారతదేశ, ప్రపంచ పటాల్లో భౌగోళిక ప్రదేశాలు గుర్తించేలా సాధన చేస్తే తక్కువ సమయంలో ఎనిమిది మార్కులు సాధించవచ్చు. మ్యాప్ పాయింటింగ్‌లో కూడా ప్రశ్నలు నేరుగా ప్రదేశాలు గుర్తించమని ఇవ్వకపోవచ్చు. పాఠ్యాంశం చివర ఉన్న ప్రశ్నలను యథాతథంగా ఇవ్వకుండా, విద్యా ప్రమాణాలను పరీక్షించే విధంగా ఇస్తారు. వివిధ గ్రాఫ్‌లు, పట్టికలు, మ్యాప్‌లు ప్రాక్టీస్ చేయాలి. 100 మార్కులు సాధించాలంటే కచ్చితంగా పాఠ్యపుస్తకంపై పట్టు సాధించాలి.

– కేఎస్‌వీ కృష్ణారెడ్డి, జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, ఈతకోట, రావులపాలెం మండలం

జీవశాస్త్రాన్ని ఇష్టంగా చదవాలి



'ఈ ఏడాది పేపరు–1, పేపరు–2గా వేర్వేరు రోజుల్లో నిర్వహిస్తున్నారు. 1వ ప్రశ్న నుంచి 17వ ప్రశ్న వరకు బయాలజీ ప్రశ్నలుంటాయి. విద్యార్థులు ప్రయోగాలు, భేదాలు, చిత్రపటాలు, టేబుల్స్‌పై శ్రద్ధ వహించాలి. 'చిత్రపటాలు, ప్రయోగశాల కృత్యాలకు ప్రాధాన్యం ఉంటుంది. వీటి నుంచి కచ్చితంగా ఎనిమిది మార్కుల ప్రశ్న వస్తోంది. ఏదైనా ఒక విషయాన్ని విశ్లేషణ చేసేలా, రెండు విషయాలను పోలుస్తూ భేదాలను రాయమంటూ ఒక ప్రశ్న వస్తుంది. పాఠ్యాంశంపై, శాస్త్రవేత్తల పరిశోధనలపై పూర్తి పట్టు సాధించేలా అభ్యసనం చేయాలి. సమాధానాలు పాయింట్ల రూపంలో రాస్తే మంచిది. ప్రశ్నకు, మార్కులకు అనుగుణంగా సమాధానాలు రాసే నేర్పు కలిగి ఉండాలి. అధిక మార్కులు సాధించాలంటే చాయిస్ ప్రశ్నలు కూడా రాయాలి.

– బత్తుల లిల్లీ, ఎస్‌ఏ(బయాలజీ), జెడ్పీహెచ్‌ఎస్, రాయవరం

క్లుప్తంగా

నేటి నుంచి అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు


అఖిల భారత సాహితీ సదస్సుకు ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వంగూరి ఫౌండేషన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో రెండు రోజులు పాటు కాకినాడలో అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు నిర్వహిస్తున్నారు. మూడు దశాబ్దాలుగా అమెరికాలో అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న వంగూరి ఫౌండేషన్ 30వ వార్షికోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహిస్తోంది. కాకినాడ దంటు కళా క్షేత్రంలో ఈ సదస్సు నిర్వహణ కోసం ఇప్పటికే నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి సాహితీ వేత్తలు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు సదస్సు నిర్వాహక సభ్యులు మార్ని జానకిరామ చౌదరి తెలిపారు. తొలిరోజు సదస్సుకు మాజీ ఉప రాష్ట్రపతి ఎం .వెంకయ్యనాయుడు, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, మండలి బుద్ధప్రసాద్ హాజరుకానున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ దుర్మరణం

పెళ్లి రోజు చేసుకునేలోపే విధి వక్రీకరించి మృత్యువాత


రమేష్ నాయుడు (ఫైల్)

అమలాపురం టౌన్: అమలాపురం నల్ల వంతెన వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ పామర్తి జానకి రమేష్ నాయుడు (31) మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నాయుడు రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు గుర్తించి అతడిని ఆస్పత్రికి తరలించినప్పటికీ మృత్యువాత పడ్డాడు. నాయుడు తన తల్లిదండ్రులకు ఒకే ఒక మగ సంతానం. నాయుడికి భార్య అనంతలక్ష్మి, మూడేళ్ల కుమార్తె, ఎనిమిది నెలల మరో కుమార్తె ఉన్నారు. శుక్రవారం నాయుడు, అనంత లక్ష్మి పెళ్లి రోజు జరుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. గురువారం రాత్రి 9.20 గంటలకు పని మీద నల్ల వంతెన రోడ్డుకు వెళ్లాడు. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి ప్రాణాలు విడిచాడు. తెల్లారితే పెళ్లి రోజు జరుపుకోవలసి ఉండగా భర్త ఆకస్మిక మరణంతో భార్య అనంతలక్ష్మి గుండెలవిసేలా కన్నీరు మున్నీరు అయ్యారు. మూడేళ్ల పెద్దమ్మాయి నాన్న ఏడి అంటూ అమ్మను అడుగుతున్న తీరు ఇరుగుపొరుగు వారిని కలిచి వేసింది. చేతికందివచ్చిన తమ ఒకే కొడుకు రోడ్డు ప్రమాదంలో కన్నుమూయడంతో నాయుడు తల్లిదండ్రులు చిన్న పిల్లల్లా ఏడుస్తున్నారు. పట్టణ సీఐ క్రిష్టోఫర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ ల్యాబ్స్ అసోసియేషన్ సంతాపం

కోనసీమ మెడికల్ ల్యాబరేటీస్ అండ్ రేడియాలాజికల్ టెక్నాలిజిస్ట్స్ అసోసియేషన్ (కేఎంఎల్ఆర్‌టీఏ)లో నాయుడు సోషల్ మీడియా కరస్పాండెంట్‌గా పనిచేస్తున్నారు. సంతాప సూచికంగా జిల్లా ల్యాబ్‌లన్నీ శుక్రవారం మూసి వేసి స్వచ్ఛంద బంద్ పాటించారు.

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వ్యాన్ బోల్తా

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


రోడ్డుపై బోల్తాపడ్డ వ్యాన్

గండేపల్లి: అక్రమ బియ్యం తరలింపులో విశ్రాంతి లేకుండా వాహనాన్ని నడిపి చివరకు ప్రమాదం బారినపడి అధికారులకు చిక్కిన వైనం మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడుకు చెందిన వెలుగుల వాసు (ఓనర్ కం డ్రైవర్) విజయవాడలో సర్వో ఆగ్రో కంపెనీ నుంచి ఎటువంటి పత్రాలు లేకుండా 252 బస్తాల రేషన్ బియ్యాన్ని తన వ్యాన్‌లో కాకినాడ జై వీరహనుమాన్ ట్రేడర్స్‌కు విక్రయించేందుకు తరలిస్తున్నాడు. మండలంలోని నీలాద్రిరావుపేట వచ్చేసరికి డ్రైవర్ కళ్లు మూతపడడంతో వ్యాన్ అదుపుతప్పి డివైడర్‌పై నుంచి దూసుకుపోయి విశాఖ వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న మరో వ్యాన్‌ను ఢీకొని బోల్తాపడింది. ఆ వ్యాన్‌లోని రెడ్డి అర్జున్ రెండు చేతులకు తీవ్ర గాయాలు కాగా ప్రమాదానికి కారణమైన వ్యాన్‌లో వాసుతో పాటు ఉన్న వల్లభశెట్టి రాజేష్‌కు గాయాలయ్యాయి. ప్రమాద స్థలం వద్దకు చేరుకున్న పోలీసులు, రోడ్డు సేఫ్టీ వాహన సిబ్బంది స్థానికుల సహాయంతో అర్జున్‌ను 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి, రాజేష్‌ను హైవే అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు. రోడ్డు సేఫ్టీ వాహన సిబ్బంది రోడ్డుపై బోల్తాపడిన వాహనాలను పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి కారణమైన బియ్యం తరలిస్తున్న వాసుపై గండేపల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలియజేశారు. బియ్యాన్ని ఎంఎస్ఎస్ గొడౌన్‌కు అప్పగించినట్టు ఎంఎస్‌వో కృష్ణ తెలియజేశారు.

ముద్రగడతో ఎంపీ బోస్ భేటీ


ముద్రగడ పద్మనాభంను కలసిన సుభాష్ చంద్రబోస్

కిర్లంపూడి: మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను కిర్లంపూడిలోని ఆయన స్వగృహంలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ముద్రగడతో కొంత సమయం చర్చించారు.

శూలాలు గుచ్చుకొని.. మొక్కులు తీర్చుకొని


బ్రాహ్మణగూడెంలో శివరాత్రి ఉత్సవాల్లో సూదులు ధరించిన భక్తులు


బ్రాహ్మణగూడెంలో స్వామి వారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


ఇమ్మిడివరప్పాడులో బుగ్గలకు, కంఠానికి శూలాలు గుచ్చుకుని ట్రాక్టరుపై ఊరేగుతున్న యువకులు

చాగల్లు: మహాశివరాత్రి సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలంలోని బ్రాహ్మణగూడెం, ఊనగట్ల గ్రామాల్లో భక్తులు వింత ఆచారం పాటిస్తారు. శరీరం అంతా సూదులు, శూలాలు గుచ్చుకుని శివునికి మొక్కుకుంటే కోరిన కోర్కెలు తీరతాయని నమ్మకం. శుక్రవారం బ్రాహ్మణగూడెం బాలరామలింగేశ్వరస్వామి ఆలయం, ఊనగట్ల ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారి ఊరేగింపు సందర్భంగా భక్తులు సూదులు, శూలాలు గుచ్చుకుని ఊరేగారు. బ్రాహ్మణగూడెంలో స్వామివారి ఊరేగింపు సందర్భంగా సుమారు 450 మంది భక్తులు ఈ విధంగా ఊరేగింపులో పాల్గొన్నారు. ఒక్కో భక్తుడు అత్యధికంగా వెయ్యి వరకు ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయంలో శూలాలు ధరించేటప్పుడు ఆలయ ప్రాంగణం అంతా శివనామ స్మరణతో మారుమోగింది. ఊనగట్లలో భక్తులు శూలాలు శరీరంపై గుచ్చుకున్నారు. శరీరంపై సూదులు గుచ్చుకోవడం చూసే వారికి ఒళ్లు గగుర్పొడిచినా భక్తులు మాత్రం తన్మయత్వంతో ఉంటారు. ఊరేగింపులో పాల్గొని, శివరాత్రి జాగారం చేసి ధరించిన శూలాలు తీస్తారు. చిన్నపిల్లలు, పెద్దలు, యువకులు అందరూ ఈ శూలాలు ధరించడం ఆనవాయితీగా వస్తోంది.

ఇమ్మిడివరప్పాడులో ...

అమలాపురం రూరల్: అమలాపురం మండలంలో ఇమ్మిడివరప్పాడులో శ్రీవీరభద్ర స్వామి సంబరం శుక్రవారం ఇమ్మిడివరప్పాడు కరికాలభక్తుల ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. యువకులు ఉపవాసంతో బుగ్గలకు, కంఠానికి శూలాలు గుచ్చుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. శూలాధారులను ట్రాక్టరు పైఉంచి బాజాబజంత్రీలతో గ్రామోత్సవం నిర్వహించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


శవాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

తుని: రైలు ప్రమాదంలో శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. తుని, అన్నవరం రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలుబండి నుంచి జారిపడి సుమారు 45 సంవత్సరాలు గల వ్యక్తిమృతి చెందాడు. మృతుడు పసుపురంగు టీ షర్ట్, నలుపు రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఇతని కుడి మోచేతిపై లక్ష్మి అని పచ్చబొట్టు ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చుస్తున్నామని, శవాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్ర పరిచినట్లు జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. వివరాలకు 94948 87786, 94906 19020 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

నల్లజర్ల: మండలంలోని తెలికిచెర్లలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై శుక్రవారం సాయంత్రం నల్లజర్ల పోలీసులు దాడి చేశారు. ఈదాడిలో 10మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.7,930 స్వాధీనం చేసుకున్నట్టు ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు

కొవ్వూరు: బిక్కవోలు మండలం తొస్సిపూడి గ్రామానికి చెందిన ఎం.వెంకటలక్ష్మి అనే మహిళ గోష్పాదక్షేత్రం స్నానఘట్టం వద్ద స్నానానికి వచ్చి కనిపించడం లేదని ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై పట్టణ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఆమె సెల్‌ఫోన్, చెప్పులు నది ఒడ్డున ఉంచి స్నానానికి వెళ్లినట్లు, గుర్తుతెలియని వ్యక్తి వెంకటలక్ష్మి సోదరి దుర్గకి ఫోన్ చేసి ఆమె నదిలో మునిగి గల్లంతైనట్లు సమాచారం ఇచ్చారు. దుర్గ ఫోన్ నంబర్‌ను డయల్ కాల్ లిస్టు నుంచి డిలెట్ చేయడం పలు అనుమానాలకు తావిస్తుంది. వాస్తవంగా స్నానఘట్టంలో గత ఈతగాళ్లు,పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. స్థానికంగా విధులు నిర్వహించిన వివిధ శాఖల ఉద్యోగులు, అర్చకులు భక్తులు వందలాది మంది నిరంతరం ఉంటున్నారు. మహిళ నదిలో గల్లంతైన విషయం వాస్తవం కాదని వారంతా కొట్టిపారేస్తున్నారు. వెంకటలక్ష్మికి చెందిన ఫోన్, బ్యాగ్‌ను ఆ గుర్తుతెలియని వ్యక్తి ఒక పూజారికి అప్పగించి వెళ్లిపోయారు. ఆమె నదిలో గల్లంతై పోయిందని ఆమె తరపు వారు వస్తే అప్పగించమని పూజారికి చెప్పి వెళ్లి పోయినట్లు చెబుతున్నారు.

11న వికాస జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈనెల 11వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె. లచ్చారావు శుక్రవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో టాటా ఎలక్ట్రానిక్స్ (ఆపిల్ మొబైల్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్, జిందాల్ ఎక్స్ కంపెనీలో బీపీవో (వాయిస్ ప్రాసెస్), వోల్టాస్ కంపెనీలో టెక్నీషియన్, భారత్ ఫోర్జ్ కంపెనీలో టెక్నీషియన్, నిట్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ ప్రొడక్షన్, డిక్సన్ కంపెనీలో టెక్నీషియన్ పోస్టులకు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వరకు జీతం, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులందరూ సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్స్‌లతో హాజరుకావచ్చన్నారు.

రత్నగిరిపై ఘనంగా మహాశివరాత్రి


శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న పండితులు

స్వామి, అమ్మవార్లకు లక్ష పూలతో పూజ

అన్నవరం: మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం రత్నగిరి సత్యదేవుని సన్నిధిన ఘనంగా జరిగాయి. సత్యదేవుని ప్రధానాలయంలో స్వామివారి పక్కనే లింగాకారంలో కొలువైన ఈశ్వరునికి తెల్లవారుజామున అభిషేకం నిర్వహించారు. విశాఖ జిల్లా పాయకరావుపేటకు చెందిన దాత పచ్చిగోళ్ల రాజారావు కుటుంబ సభ్యులతో కలసి లక్ష గులాబీ, చామంతి తదితర పూలను స్వామివారికి సమర్పించారు. ఆ పుష్పాలతో ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, ఉప ప్రధానార్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, అర్చకులు సుధీర్ స్వామివారికి అర్చన నిర్వహించారు. ఆలయం దిగువన గల యంత్రాలయంలోని పంచాయతనంలో కొలువైన శివలింగానికి అభిషేకం నిర్వహించారు.

గంగాపార్వతీ సమేత భూలోకేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా వేడుకలు

స్థానిక పంపా సత్రం వెనుక గల శ్రీ గంగాపార్వతీ సమేత భూలోకేశ్వరస్వామివారి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. రాత్రి ఎనిమిది గంటల నుంచి శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. వ్రత పురోహితులు ఛామర్తి కన్నబాబు ఆధ్వర్యంలో పండితులు కల్యాణం నిర్వహించారు.

బోట్‌క్లబ్ చెరువులో పడి వృద్ధుడి మృతి

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద బోట్‌క్లబ్ చెరువులో పడి రమణయ్యపేట 1వ డివిజన్‌కు చెందిన వృద్ధుడు గొర్ల వెంకటరమణ(64) శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. సర్పవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటరమణ మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మద్యానికి బానిసగా మారిన వెంకటరమణ ప్రమాదవశాత్తూ పడి చనిపోయాడా, లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనేది విచారణలో తేలవల్సి ఉంది. మృతుడి కుమారుడు సత్తిబాబు ఫిర్యాదు మేరకు ఏఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ టెన్త్, ఇంటర్ వన్ సిట్టింగ్ రెగ్యులర్ ఇంటర్‌లో ఫెయిలయిన వారికి కట్టుకునే అవకాశం. డిగ్రీ & పీజీ, సైన్స్ & ఆర్ట్స్, MBA, B.Li.Sc. నాగార్జున, ఆంధ్ర, వెంకటేశ్వర యూనివర్సిటీల ఎగ్జామ్స్ అన్నీ మా కాకతీయ విద్యాసంస్థలలో జరుగును. 100% పాస్. అడ్మిషన్లు జరుగుచున్నవి. కాకినాడ దగ్గరలో గల గొల్లపాలెం, రాజమండ్రి, ఆత్రేయపురం. ఫోన్ : 99494 82757, 98495 82043 [V-2417]

Real Estate

LAND FOR SALE

■ రాజమండ్రి ఎయిర్‌పోర్టు దగ్గర లే–అవుట్ లో 100 గజములు సైట్లు గజం రూ.350000/–లకే అమ్మకం. సంప్రదించండి. 9515382999 [C-1242740]

PLOT FOR SALE

■ పెద్దాపురం గుర్రాల సెంటర్, జగ్గంపేట రోడ్‌లో 90x100 స్థలము అమ్మకము. కత్తిపూడి హైవేకి 8 ఎకరాలు భూమి అమ్మకం మరియు కాకినాడ, తూరంగి సూర్యనగర్‌లో W/F బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ : 95500 58067 [R-264]

Services

■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-6356]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 945 945 3338 [G-824357]

ASTROLOGY

■ ఓం శక్తి జ్యోతిష్యాలయం: వ్యవసాయం, వ్యాపారం, ఉద్యోగం, చదువు, ప్రేమ, పెళ్లి, సంతానం, విదేశీయానం, రాజకీయం, ధనం ఇంకా ఎటువంటి సమస్యలకైనా 9 రోజులలో శాశ్వత పరిష్కారం. వశీకరణ స్పెషలిస్ట్ గురూజీ: దుర్గాప్రసాద్ రాజు – 9849957621 [W-1200997]

Wanted

■ రాజమండ్రి SVG Market Jayantilal & Son's A-38 Kirana Masala Shop నందు పనిచేయుటకు Helpers (Gents) కావలెను. Cont: ✆ : 94413 92262, 0883-2468674 [R-1184331]

■ Wanted for Diagnostic Centre, Amalapuram, 1) Lab Technician 2 Nos (F) Qly.: MLT/DMLT 2)X-ray Technician 1 nos (F) Qly: DMRT. Salary: Negotiable. Contact: 90005 06528 [R-1151711]

■ పిఠాపురం/కాకినాడ/రాజమండ్రిలోసిమెంట్ రోడ్లతో ఉన్న వెంచర్‌లో ప్లాట్స్ సేల్ చేయుటకు అనుభవం కలిగిన రియల్ ఎస్టేట్ వారు కావలెను. వెంటనే కాల్ చేయండి 92991 08109 [R-6455]

■ మీరు ఉన్నచోటు నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో అధిక ఆదాయం సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్‌టైం) 100% ఎటువంటి ఫీజులు ఉండవు. ఫోన్: 99595 43389 [V- 823751]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233878]

■ కష్టలేనిస్ట్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషుల ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం, HYD. ఫోన్: 7995365999. [HA-1334]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్దులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K. Ph: 9160900024/9640400073 [HA-1320]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/– సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520,89197 39694. [M-1167540]

■ రామకృష్ణ గ్రూపు, (AP, న్యూ ఢిల్లీ No.1) శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ + జీ: 15-18 వేలు, ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 62812 08567, 92814 52827 [B-1239898]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.